క్లుప్తంగా

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



దాత హరినాథ్‌కి రశీదు అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం కొనుగోలు నిమిత్తం విజయవాడకు చెందిన కెవీఎల్ హరినాథ్ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ఆచార్యులుకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు రశీదు అందించారు. ఆలయ ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి బీఎల్‌వోలకు శిక్షణ



పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం

పెందుర్తి: భారత ఎన్నికల సంఘం, ఐఈడీ ఈఎం ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారు(బీఎల్‌వో)లకు సోమవారం నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పెందుర్తి ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు తెలిపారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడలోని 299 మంది బీఎల్‌వోలకు గాను రోజుకు 50 మంది చొప్పున ఈ నెల 14 వరకు ఆరు బృందాలుగా శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల/ఓటర్ల జాబితా నిర్వాహణపై ఉన్నతాధికారులు శిక్షణ అందిస్తారన్నారు. బీఎల్‌వోలు అందరూ వారికి కేటాయించిన తేదీల్లో తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని సూచించారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్య నారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా అమ్మవార్ల పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మినగర్‌లో కొలువైన మరిడిమాంబ, పశువులమ్మ అమ్మవార్ల వార్షిక పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు-కుంకుమలు, చీరలు సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన వారు, ముడుపులు కట్టిన వారు మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. సాయంత్రం అనుపోత్సవం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ స్వామినాయుడు

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ స్వామినాయుడు అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన కుటుంబాలకు సమాజంలో ఎదురయ్యే అవమానాలను గుర్తుంచుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. ఏఎస్ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

28 ఏళ్ల వెలుగుల ప్రస్థానం

రేపు సింహాద్రి ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలో ఏర్పాటైన వెలుగుల కొండ సింహాద్రి ఎన్టీపీసీ నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తిలో మేటిగా పేరొందింది. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4 యూనిట్లతో మొత్తం 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దీని సొంతం. మహారత్న కంపెనీగా ఆరు రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఈ సంస్థ మంగళవారం 28వ వ్యవస్థాపక దినోత్సవానికి సిద్ధమైంది.

ఆరు రాష్ట్రాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

భద్రత, సామాజిక సేవా కార్యక్రమాల్లో మేటి





తుస్కర్ అవార్డులు పొందిన ఉద్యోగులతో ఈడీ

ప్రారంభం: **1997 జూలై 8**
వ్యయం: రూ.**3,650** కోట్లు
యూనిట్లు: **4** (ఒక్కోటి **500** మెగావాట్లు)
పూర్తి సామర్థ్యం: **2,000** మెగావాట్లు
విస్తీర్ణం: **3,492** ఎకరాలు

పరవాడ: సింహాద్రి జాతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (సింహాద్రి ఎన్టీపీసీ) 28వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 8న ఘనంగా జరుపుకోబోతుంది. పరవాడ సమీపంలో 3,492 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,650 కోట్ల వ్యయంతో 1997 జూలై 8న దీన్ని ఏర్పాటు చేశారు. రెండు వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం కలిగిన సంస్థ 2021లో రూ.110 కోట్ల వ్యయంతో సంస్థ రిజర్వాయర్‌పై 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేసింది. దేశంలోనే నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తితో మహారత్న కంపెనీగా పేరొందిన సింహాద్రి ఎన్టీపీసీ మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ ప్రగతిపథంలో పయనిస్తుంది. భద్రత ప్రమాణాలను పాటిస్తూ అవార్డులను, సీఎస్సార్ నిధులతో నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతోంది.

గ్రామీణాభివృద్ధే సంస్థ లక్ష్యం



సీఎస్సార్ నిధుల ద్వారా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం. రూ.కోట్లలో వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో విద్య, తాగునీరు, వైద్యం, ఉపాధి కల్పన వంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నాం. బాలికా సాధికారతలో భాగంగా ఈ ఏడాది రూ.50 లక్షలతో వివిధ పాఠశాలలకు చెందిన 120 మంది బాలికలకు సంగీతం, నృత్యం, ఆత్మరక్షణ, యోగా, క్రీడలు తదితర అంశాల్లో శిక్షణ, బాలభారతి పబ్లిక్ స్కూల్లో 10 తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నాం.

– సమీర్‌శర్మ, సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జీజీఎం, సింహాద్రి ఎన్టీపీసీ



సాధికారిత బాలలతో ఈడీ సమీర్‌శర్మ దంపతులు

రిజర్వాయర్‌పై ఏర్పాటు చేసిన 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్



సింహాద్రి ఎన్టీపీసీ విశేషాలు

- సంస్థ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 16 మంది గ్రూప్ జనరల్ మేనేజర్లు మారారు. 17వ జీజీఎంగా సమీర్‌శర్మ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- సంస్థలో సుమారు 550 మంది శాశ్వత ఉద్యోగులతో పాటు రెండు వేలకు పైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు.
- 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 30 వేల మెట్రిక్ టన్నుల బొగ్గును ఉపయోగిస్తోంది. ఈ బొగ్గును ఒడిశాలోని మహానంది గనుల నుంచి దిగుమతి చేసుకుంటోంది.
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ద్వారా వస్తున్న 25 మెగావాట్ల విద్యుత్ తన సొంత అవసరాలకు వినియోగిస్తోంది.
- ఉత్పత్తి ప్రక్రియలో కావాల్సిన ఉప్పు నీటిని తిక్కవానిపాలెం సముద్ర జలాల నుంచి, మంచి నీటిని ఏలేరు కాలువ నుంచి సేకరిస్తోంది.స్తుంది.
- కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.
- ప్లాంట్ నుంచి నిత్యం 4 వేల టన్నులకు పైగా బూడిదను ఇటుక, సిమెంట్ పరిశ్రమలు, రహదారుల నిర్మాణాలకు సరఫరా చేస్తోంది.

సీఎస్సార్ సేవల్లో మేటి సింహాద్రి

- 2024–25లో సుమారు రూ.5.50 కోట్లతో నిర్వాసిత గ్రామాల్లో తాగునీరు, విద్య, రోడ్లు, పాఠశాల భవనాలు, ఉచిత వైద్య శిబిరాలు, కాలువలు, సోలార్ వీధి దీపాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళలకు స్వయం ఉపాధి పథకాలతో లబ్ధి చేకూర్చేందుకు బ్యుటీషియన్, కుట్టు శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టింది.
- బాలిక సాధికారతలో భాగంగా ఈ ఏడాది 120 మంది బాలికలకు వివిధ రంగాల్లో శిక్షణతోపాటు, ఉచిత విద్యను అందిస్తోంది.



ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారితో సీఎస్సార్ విభాగం అధికారులు

- పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటుతోంది.
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా రూ.1.46 కోట్ల వ్యయంతో విజయవాడలో సీఐపీఈటీ ద్వారా శిక్షణ అందిస్తోంది.
- రూ.2 కోట్లతో అనకాపల్లి ఇండోర్ స్టేడియం అభివృద్ధి.
- తానాం రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల డార్మిటరీ అభివృద్ధికి రూ.50 లక్షలు వ్యయం.
- పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.19 లక్షలతో ఏర్పాటు చేసిన రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.
- పర్యావరణ పరిరక్షణ, భద్రతా ప్రమాణాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు 2024లో సంస్థకు రెండు అపెక్స్ ఇండియా ఫౌండేషన్ అవార్డులు, స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు, ఎక్స్‌లెన్స్ అవార్డు, పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు, 2025లో తుస్కర్ అవార్డులను సంస్థ అందుకుంది.

నేత్ర, రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు, యువకులు

సబ్బవరం: మండలంలోని వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వెంకట సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తదాన, నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరిసర గ్రామాల నుంచి వచ్చిన 200 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 30 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మిగిలినవారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైనవారికి ఉచితంగా చేస్తామన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ వెంకటలక్ష్మి, సిబ్బంది, గ్రామ సర్పంచ్ ఆకుల గణేష్, ఎంపీటీసీ గవర తులసి, గ్రామ పెద్దలు ఆకుల గణేష్, గవర రాజు, కోట్ని అమ్మతల్లినాయుడు, పాట్నూరి అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం



స్వామివారిని అభిషేకించేందుకు నీటి బిందెలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు గొర్లివానిపాలెంలో కొలువైన ఉమా రామలింగేశ్వర, లక్ష్మీ సత్యనారాయణ, కోదండ సీతారామస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం సహస్ర ఘటాభిషేకం ఘనంగా జరిపారు. ముందుగా ఉమా రామలింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చెంనాయుడు మాట్లాడుతూ వరుణ దేవుడు కటాక్షించి పుష్కలంగా వర్షాలు కురిసి, పాడి పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే విశ్వాసంతో 48 ఏళ్లగా ఈ సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారురు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్లి ఉమా మహేశ్వరరావు, గ్రామ పెద్దలు గొర్లి సత్యం, తమరాణ శివ, లెక్కల త్రిమూర్తులు, గొర్లి నీలేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ఏకాదశి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



పూజలందుకున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: పవిత్ర తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటాద్రిపైనున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, అష్టోత్తర పూజలు జరిపారు. విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. కొందరు భక్తులు తులాభారం సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సత్యనారాయణస్వామికి..

పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివాకి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

రేబిస్ నిర్మూలనకు కృషి



పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు



పెంపుడు కుక్కలకు టీకా వేస్తున్న ఉషాకుమారి

పెందుర్తి: రేబిస్ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు జీవీఎంసీ అందించిన రేబిస్ వ్యాక్సిన్లను ఆదివారం ఉచితంగా అందించారు. మొత్తం 327 పెంపుడు కుక్కలకు ఆయన వ్యాక్సిన్లు వేశారు. పెంపుడు కుక్కలకు జీవీఎంసీ అందించిన లైసెన్సులు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ అధికారులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్లను ఆదివారం అందించారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో సహాయ సంచాలకులు డాక్టర్ ఉషాకుమారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించి పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. జంతువుల నుంచి మనుషులకు రేబిస్ సోకకుండా ఉండాలంటే పెంపుడు కుక్కలకు టీకాలు తప్పనిసరన్నారు. గుల్లేపల్లి, అంతకాపల్లి, ఆరిపాక పశు వైద్య కేంద్రాల్లో కూడా ఈ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



నరవలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెందుర్తి: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంగలపూడి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక నేత గళ్లా శ్రీను, పలువురు నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. స్థానిక నాయకులు అప్పన్న, అప్పారావు, గుడివాడ శివ తదితరులు పాల్గొన్నారు.

'మేహాద్రి'లో ఈత ప్రమాదం



మేహాద్రి రిజర్వాయర్ వద్ద సందర్శకులకు హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు

పెందుర్తి: ప్రమాదకరమైన ఊబి, లోతు ఉన్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఈత చాలా ప్రమాదకరమని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మధ్యాహ్నం మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో కొంత మంది యువకులు ఈతకు దిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సీఐ సిబ్బందిని అక్కడకు పంపి యువకులను బయటకు రప్పించారు. కౌన్సెలింగ్ ఇచ్చి వారిని అక్కడి నుంచి పంపించేశారు. సందర్శకులకు తగిన సూచనలు సలహాలు అందించారు. ప్రమాదాలు చెప్పి రావని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

శ్రీకృష్ణ మందిరంలో దీపారాధన



దీపారాధనలో భక్తులు

సబ్బవరం: సబ్బవరం గోపాల్‌నగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి సన్నిధిలో దీపారాధన నిర్వహించారు.

సేవలందిస్తామంటే.. ఇంతటి చిన్నచూపా?



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

దేవస్థానం, పోలీస్ అధికారులను నిలదీసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సింహాచలం: ఈ నెల 9న గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని పోలీస్‌శాఖ, దేవస్థానం తీసుకున్న నిర్ణయాల పట్ల పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈసారి పెద్ద ఎత్తున ఆంక్షలు విధించడంపై నిరసనగళం వినిపిస్తున్నారు. గోపాలపట్నం నుంచి పాత అడవివరం వరకు, అలాగే నగరంలో పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే స్టాళ్ల విషయంలో పోలీసులు ఇటీవల పలు ఆంక్షలు విధించారు. గోపాలపట్నం నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఏటా మాదిరి రోడ్డును ఆనుకుని కాకుండా పక్కగా ఉండే సందుల్లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలని, మెటీరియల్ తీసుకెళ్లేందుకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. దీంతో మళ్లీ ఆదివారం గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో త్రినాథరావులు వారితో పరిపాలన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ నిరసన గళం వినిపించారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఆంక్షలు ఎక్కువగా విధించడాన్ని వ్యతిరేకించారు. తాము ఏర్పాటుచేసే స్టాల్‌కి మెటీరియల్ తీసుకెళ్లేందుకు కూడా వాహనాలకు అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. భక్తుల సేవ చేద్దామంటే చేయనీయకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఈ తరుణంలో గోపాలపట్నం సీఐ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ జరిగే గోపాలపట్నం నుంచి పాత అడవివరం వరకు తీవ్ర రద్దీ ఉంటుందని, దాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రధాన రోడ్డుపై కాకుండా అంతర్గత రోడ్లలో స్టాల్స్ ఏర్పాటుకు సూచించినట్టు స్పష్టం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా లేని ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెహికల్ పాస్‌లపై స్పష్టత ఇవ్వకుండానే సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, ఉద్యోగులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చనని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.